## క్లుప్తంగా

### నియామకం


ఉప్పు రాంకిషన్


బండ తిరుపతిరెడ్డి

రామడుగు: మండలంలోని దేశరాజ్‌పల్లి గ్రామానికి చెందిన ఉప్పు రాంకిషన్ బీజేపీ జిల్లా కార్యదర్శిగా, శ్రీరాములపల్లి గ్రామానికి చెందిన బండ తిరుపతిరెడ్డి, వెలిచాల గ్రామానికి చెందిన ఉప్పు శ్రీనివాస్‌పటేల్ జిల్లా కార్యవర్గ సభ్యులుగా నియామకమయ్యారు. ఈమేరకు జిల్లా అధ్యక్షుడు కృష్ణారెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు.

### బీజేపీ జిల్లా కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి

సైదాపూర్: మండలంలోని గుండ్లపల్లి సర్పంచ్ వీరమల్ల రవీందర్‌రెడ్డిని బీజేపీ జిల్లా కార్యదర్శిగా నియమించినట్లు జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడుగా పని చేస్తున్న రవీందర్‌రెడ్డికి అవకాశమిచ్చినట్లు గంగారెడ్డి తెలిపారు. పార్టీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని, నియామకానికి కృషి చేసిన కృష్ణారెడ్డి, ఇతరులకు రవీందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

### ఆలయానికి విరాళం


విరాళం అందజేస్తున్న శ్రీనివాస్

గన్నేరువరం: మండలంలోని ఖాసీంపేట గ్రామం శ్రీమానసాదేవి ఆలయానికి కరీంనగర్‌లోని జ్యోతినగర్‌కు చెందిన బుద్ది శ్రీనివాస్ రూ.5,116 విరాళం ఇచ్చారు. సోమవారం కుటుంబసభ్యులు శారద, ఆమనితో కలిసి ఆలయ కమిటీ సభ్యులకు నగదు అందజేశారు. ఈకార్యక్రమంలో ఆలయ కమిటీ గౌరవ అధ్యక్షుడు బద్దం చిన్న నర్సింహారెడ్డి, చైర్మన్ ఏలేటి చంద్రారెడ్డి, ఆలయ ప్రధాన అర్చకులు మామిడాల నాగసాయిశర్మ, డైరెక్టర్లు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

### కాంగ్రెస్ ఎస్సీ సెల్ మండల కన్వీనర్‌గా అంజయ్య


అంజయ్య

కరీంనగర్‌రూరల్: కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కరీంనగర్‌రూరల్ మండల కన్వీనర్‌గా బహదూర్ ఖాన్‌పేటకు చెందిన తొప్పెట్ల అంజయ్యను నియమించినట్లు ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు కొర్వి అరుణ్‌కుమార్ తెలిపారు. కాంగ్రెస్ పార్టీలో వివిధ పదవులను సమర్థవంతంగా నిర్వహించిన అంజయ్య సేవలను గుర్తించి కన్వీనర్‌గా నియమించామన్నారు. ఈ సందర్భంగా అంజయ్య మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో ఎస్సీ సెల్‌ను బలోపేతం చేసేందుకు కృషి చేస్తానని తెలిపారు. తన నియామకానికి సహకరించిన మండల, జిల్లా కాంగ్రెస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

### వృద్ధాశ్రమానికి బీరువా వితరణ



విద్యానగర్(కరీంనగర్): కరీంనగర్ మంకమ్మతోటలోని శ్రీలక్ష్మీ వృద్ధాశ్రమానికి దీపావళి సందర్భంగా ఆదివారం విశ్రాంత భౌతిక శాస్త్ర అధ్యాపకుడు, ఎన్ఎస్ఎస్ జాతీయ అవార్డు గ్రహీత లయన్ ఎల్లాల లక్ష్మారెడ్డి బీరువాను విరాళంగా అందజేశారు. వృద్ధాశ్రమంలోని వారికి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త, జాతీయ యువజన అవార్డీ ఏ.కిరణ్‌కుమార్, వృద్ధాశ్రమ ఇన్‌చార్జి సుమలత తదితరులు పాల్గొన్నారు.

### రాష్ట్ర ప్రజలు మార్పు కోరుకొంటున్నారు

కరీంనగర్ కార్పొరేషన్: తెలంగాణ ప్రజలు మార్పు కోరుకొంటున్నారని, రాష్ట్రంలో మార్పు తథ్యమని కాంగ్రెస్ పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జి క్రిస్టోఫర్ తిలక్ అన్నారు. సోమవారం కాంగ్రెస్ పార్టీ నగర అధ్యక్షుడు కోమటిరెడ్డి నరేందర్‌రెడ్డి అధ్యక్షతన డీసీసీ కార్యాలయంలో జరిగిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. కేసీఆర్ హామీలు ఇస్తుంటాడు తప్ప అమలు చేయడని, నీళ్లు నిధులు నియామకాలు కేవలం కేసీఆర్ కుటుంబానికి మాత్రమే వచ్చాయని విమర్శించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ అభ్యర్థి పురుమల్ల శ్రీనివాస్, మెన్నేని రోహిత్‌రావు, వైద్యుల అంజన్‌కుమార్, సమద్‌నవాబ్, ఎండీ. తాజ్, పడాల రాహుల్, అబ్దుల్ రెహమాన్ తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధికే ఓటేస్తాం

- నూతన ఓటర్ల ఉత్సాహం
- ఓటుహక్కును దుర్వినియోగం చేయం
- దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుంది
- నిర్భయంగా ఓటేస్తాం

సాక్షి పీపుల్స్ ఎజెండా

మానకొండూర్: ప్రజాస్వామ్యంలో ఓటుహక్కు చాలా విలువైనది. సమాజ మార్పుకోసం రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కును తొలిసారిగా వినియోగించుకునేందుకు అవకాశం రావడంతో నూతన ఓటర్లు చాలా ఉత్సాహం చూపుతున్నారు. 18 ఏళ్లు నిండిన యువత ఇటీవల ఓటుహక్కుకు దరఖాస్తు చేసుకోగా ఓటరు గుర్తింపు కార్డులు అందుకున్నారు. ఈ నెల 30న అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు వినియోగించుకోనున్నారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కు తొలిసారి వినియోగించుకోవడం అనుభూతిని ఇస్తోందని 'సాక్షి'కి తెలిపారు. ప్రలోభాలకు లొంగమని, ప్రజాస్వామ్య దేశంలో ఓటు గొప్ప ఆయుధం, దేశ భవిష్యత్‌ను నిర్ణయిస్తుందని, ఓటుహక్కును దుర్వినియోగం చేయమని, నిర్భయంగా ఓటు వేస్తామని తెలిపారు.



చెంజర్లలో బీఎల్‌వోకు దరఖాస్తు అందిస్తున్న యువతి (పాత చిత్రం)

### మంచి నాయకుడిని ఎన్నుకోవాలి



తొలిసారిగా ఓటు వేయబోతున్నా, మంచి నాయకుడిని ఎన్నుకోవాలని ఉంది. నియోజకవర్గ అభివృద్ధితో పాటు కేజీ నుంచి పీజీ వరకు విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలి. మొదటిసారి ఓటు హక్కు వినియోగించుకుంటున్నందుకు నాకు చాలా సంతోషంగా ఉంది. – దండ్యాల విశ్వనాథ్, మానకొండూర్

### సంక్షేమం పట్టించుకోవాలి



తొలిసారి ఓటు వేయడానికి సిద్ధమవుతుండటం చాలా ఆనందంగా ఉంది. గ్రామాల్లో మౌలిక వసతులు తీర్చేనాయకుడిని ఎన్నుకుంటా, బరిలో ఉన్నవారిలో మంచి నాయకుడిని గుర్తించి ఓటు వేస్తా. ప్రజాసమస్యలను పట్టించుకోవాలి. గెలిచాక ప్రజలను మర్చిపోవద్దు. – గౌడ విక్రమ్, ఖాదర్‌గూడెం

### ప్రజానాయకుడిగా ఉండాలి



ఇటీవల ఓటరు గుర్తింపుకార్డు కోసం దరఖాస్తు చేసుకున్నాను. అధికారులు పరిశీలన చేసి గుర్తింపు కార్డు అందజేశారు. ప్రజాసమస్యలు పట్టించుకునేవారు, గ్రామాలను అభివృద్ధి చేసేవారు, ప్రజానాయకుడిగా ఉండేవారిని ఎన్నికల్లో ఎన్నుకుంటాం. అభివృద్ధికి ప్రాధాన్యం ఇవ్వాలి. – తాళ్ల, సందీప్, చెంజర్ల

### సంతోషంగా ఉంది



మొదటిసారి ఓటుహక్కును వినియోగించుకుంటున్నందుకు సంతోషంగా ఉంది. ప్రజాసంక్షేమం, యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తే సమాజం అభివృద్ధి చెందుతుంది. ఆ దిశగా కృషి చేసే నాయకుడికే నా ఓటు. ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. – ఆర్.పావని, మానకొండూర్

### పాలనలో పారదర్శకత చూపించాలి



నూతనంగా ఓటు వేసే అవకాశం వచ్చింది. మొదటిసారి ఓటు వేస్తున్నందుకు ఆనందంగా ఉంది. పాలనలో పారదర్శకత చూపించే మంచి నాయకుడిని గుర్తించి ఓటువేద్దాం అనుకుంటున్నాను. ఎన్నికల్లో ఓటుహక్కును దుర్వినియోగం చేసుకోను. – కె. సాయివసంత్, మానకొండూర్

### పథకాలు అందరికీ చేరాలి



ప్రజల సమస్యల కోసం పోరాడే నాయకుడు, అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలు ప్రతి లబ్ధిదారుడికి అందేలా చూసే నాయకుడికి ఓటేస్తా. ఎన్నికైన నాయకుడు గ్రామాల్లో మౌలిక వసతుల కల్పనకు కృషి చేయాలి. ప్రజల మధ్యలో ఉండాలి. ఓటు సరిగా వినియోగించుకోవాలి. – సాయికృష్ణ, మానకొండూర్

# ఎన్నికలకు సహకరించాలి

- కరీంనగర్ ఏసీపీ టి. కరుణాకర్‌రావు
- గంగాధరలో పోలీసులు, కేంద్రబలగాల కవాతు


మాట్లాడుతున్న ఏసీపీ కరుణాకర్‌రావు


పోలీసులు, కేంద్ర బలగాల కవాతు

గంగాధర: అసెంబ్లీ ఎన్నికలు శాంతియుతంగా నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని కరీంనగర్ ఏసీపీ టి.కరుణాకర్‌రావు కోరారు. మండలంలోని మధురానగర్ చౌరస్తా నుంచి మల్లాపూర్ రోడ్డు, అక్కడి నుంచి అంబేద్కర్ విగ్రహం వరకు స్థానిక ఎస్సై పుల్ల అభిలాష్ ఆధ్వర్యంలో పోలీసులు, కేంద్ర బలగాలతో సోమవారం కవాతు నిర్వహించారు. ఈసందర్భంగా మధురానగర్ చౌరస్తాలో ప్రజలకు ఎన్నికల నిబంధనలు, నిర్వహణపై అవగాహన కల్పించారు. నవంబర్ 30న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఎలాంటి భయభ్రాంతులకు గురికాకుండా ఓటుహక్కును వినియోగించుకోవాలని సూచించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ముందు జాగ్రత్తగా కేంద్ర, రాష్ట్ర పోలీసు బలగాల సహకారంతో ఎన్నికల నిర్వహణ కొనసాగుతుందన్నారు. ఎవ్వరైనా ఓటింగ్ విషయంలో భయభ్రాంతులకు గురి చేస్తే నిర్భయంగా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు. ఈకార్యక్రమంలో చొప్పదండి సీఐ రవీందర్, వివిధ పోలీస్‌స్టేషన్ల ఎస్సైలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

**ఎన్నికల నియమావళి పాటించకుంటే చట్టరీత్యా చర్యలు**

చిగురుమామిడి: ఎన్నికల ప్రచారంలో పాల్గొనేవారు పదిమంది కంటే ఎక్కువ ఉంటే తప్పనిసరిగా ఎన్నికల రిటర్నింగ్ అధికారి అనుమతి పత్రం పొందాలని చిగురుమామిడి ఎస్సై బి. రాజేశ్ సూచించారు. సోమవారం సాయంత్రం చిగురుమామిడిలో విలేకర్లతో మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఎన్నికల నియమావళి పాటించాలని, లేదంటే చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. గ్రామాల్లో బెల్ట్‌షాపులు నిర్వహించినా, సిట్టింగ్‌లపైనా చట్టరీత్యా చర్యలు తీసుకోవాల్సి ఉంటుందన్నారు. బైండోవర్ చేసిన వ్యక్తులు గ్రామాల్లో ఎలాంటి అసంఘటిత చర్యలకు పాల్పడితే జరిమానాతో పాటు జైలుశిక్ష విధించబడుతుందన్నారు.

# హమాలీల పొట్టకొట్టొద్దు


మాట్లాడుతున్న సీపీఎం మానకొండూర్ జోన్ కార్యదర్శి సుంకిరి సంపత్

- పొరండ్ల సొసైటీ చైర్మన్‌పై సీపీఎం నాయకుల ఆగ్రహం
- కూలిరేట్లు తగ్గించడంపై నిరసన

తిమ్మాపూర్: ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో పొరండ్ల సొసైటీ చైర్మన్ సింగిరెడ్డి స్వామిరెడ్డి హమాలీల కూలి రేట్లు తగ్గిస్తూ కార్మికుల పొట్ట కొడుతున్నారని సీపీఎం మానకొండూరు జోన్ కార్యదర్శి సుంకరి సంపత్ ఆరోపించారు. పొరండ్ల, తిమ్మాపూర్, మహాత్మానగర్ గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో పనిచేస్తున్న హమాలీలకు పోటీగా బిహార్ నుంచి కార్మికులను తీసుకురావడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక హమాలీలకు ఉపాధి లేకుండా సొసైటీ చైర్మన్ వ్యవహరిస్తున్నారని, గతేడాది నుంచి క్వింటాల్‌కు రూ.యాభై రూపాయలు జిల్లా వ్యాప్తంగా అమలవుతున్నప్పటికీ పొరండ్ల సొసైటీ పరిధిలో క్వింటాల్‌కు రూ.45 మాత్రమే అమలు చేస్తున్నారని, ఈ సీజన్‌లో ఇప్పటికే జిల్లాలో ఇతర కొనుగోలు కేంద్రాల్లో రూ.48 అమలవుతున్నా ఈ సొసైటీ పరిధిలో అమలు చేయడం లేదన్నారు. కూలిరేట్లు తగ్గిస్తూ తక్కువ ధరకే కూలీలు దొరుకుతున్నారని ఇతర రాష్ట్రాల నుంచి కార్మికులను హమాలీలపైకి ఉసిగొల్పుతున్నాడ, స్థానిక గ్రామాల్లో ఉన్నటువంటి కార్మికుల ఉపాధిని కాపాడాలని డిమాండ్ చేశారు. కార్మికులకు నష్టం కలిగించే విధంగా చర్యలు చేస్తున్న కొనుగోలు కేంద్రాల నిర్వాహకులపై కఠినమైన చర్యలు తీసుకోవాలన్నారు. లేని పక్షంలో మండల, జిల్లా వ్యాప్తంగా హమాలీలను ఐక్యం చేసి స్థానికులకే ఉపాధి కల్పించాలని పోరాటం నిర్వహిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మాతంగి శంకర్, హమాలీ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఉప్పునూటి శ్రీనివాస్, తిమ్మాపూర్ సంఘం అధ్యక్షుడు మీస సంపత్, నాగరాజు, ఐలయ్య, బాలయ్య, తిరుపతి, శ్రీనివాస్, ఆంజనేయులు, రవి హనుమంతు, తదితరులు పాల్గొన్నారు.

## హ్యాండ్‌బాల్ పోటీల్లో విద్యార్థి ప్రతిభ


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు

జమ్మికుంట: పట్టణంలోని సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలకు చెందిన విద్యార్థి రవిశంకర్ ఎస్‌జీఎఫ్(స్కూల్ గేమ్స్ ఫెడరేషన్)అండర్ –19 రాష్ట్ర స్థాయి హ్యాండ్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచాడని ప్రిన్సిపల్ కుమారస్వామి సోమవారం విద్యార్థిని అభినందించారు. ఈ నెల 10వ తేదీ నుంచి 12తేదీ వరకు మహబూబ్‌నగర్‌లో నిర్వహించిన పోటీల్లో కరీంనగర్ జిల్లా జట్టుకు ఎంపికై పాల్గొన్నాడని, రాష్ట్రస్థాయిలో ద్వితీయ స్థానం సాధించాడని తెలిపారు. ఇంటర్ విద్యార్థి పోటీల్లో ప్రతిభ కనబరచడంపట్ల ఉపాధ్యాయులు హర్షం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హౌస్‌మాస్టర్ తిరుపతి, ఫిజికల్ డైరెక్టర్ సుమన్, ఫిజికల్ ఎడ్యుకేషన్ టీచర్ రాజేందర్, తదితరులు పాల్గొన్నారు.

## అసలైన ప్రకాశం పరమేశ్వరుడే


కేదారేశ్వరి వ్రతం నిర్వహిస్తున్న పురాణం మహేశ్వరశర్మ

విద్యానగర్(కరీంనగర్): దారిద్ర్యం, దైన్యం, అజ్ఞానానికి సంకేతం చీకటి అని, ఆ చీకట్లను పారద్రోలే అసలైన ప్రకాశవంతుడు పరమేశ్వరుడే అని వేదపండితుడు పురాణం మహేశ్వరశర్మ అన్నారు. సోమవారం కరీంనగర్‌లోని జ్యోతినగర్‌లో గల కమల పెరల్స్ అపార్ట్‌మెంట్‌లో పురాణం మహేశ్వరశర్మ ఆధ్వర్యంలో కేదారేశ్వర వ్రతాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన ఆధ్యాత్మిక ప్రసంగం చేస్తూ ఐశ్వర్యం, ఆనందం, జ్ఞానం జ్యోతి స్వరూపాలన్నా రు. ప్రాణుల హృదయాల్లో చైతన్య ప్రధాతగా ఉన్న ఆ పరంజ్యోతికి ప్రతీకలే దీపా కాంతులని తెలిపారు. ఈ పూజల్లో అపార్టుమెంట్ వాసులు తొడుపునూరి సంతోష్‌కుమార్, నీరజ, కొంజర్ల మాదవి, వంగళ మమత, బల్మూరి పద్మ, కృష్ణవేణి, కస్తూరి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్థికసాయం


నగదు అందిస్తున్న సాంబారి కొమురయ్య


గన్నేరువరం: జంగపల్లిలో...

గన్నేరువరం: మండలంలోని జంగపల్లి గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ జక్కని ఆంజనేయులు ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. ఆయన కుటుంబ సభ్యులను సోమవారం పద్మశాలీ సంఘం మండల అధ్యక్షుడు గుంటుక లింగయ్య ఆధ్వర్యంలో సభ్యులు పరామర్శించారు. అనంతరం రెండువేల ఆర్థికసాయం అందజేశారు. వెంట గుంటుక శ్రీనివాస్, రవి, లక్ష్మీనారాయణ, రవి, జక్కన మురహరి పాల్గొన్నారు.

**స్నేహితుడి కుటుంబానికి ఆర్థికసాయం**

ఇల్లందకుంట: మండల కేంద్రానికి చెందిన శనిగరపు రాము ఇటీవల మృతి చెందాడు. ఆయన కుటుంబ సభ్యులకు 1992–93 పదో తరగతి విద్యార్థులు సోమవారం రూ.26,500 అందజేశారు. కార్యక్రమంలో చిన్ననాటి మిత్రులు శ్రీనివాస్, అన్వర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

**దహన సంస్కారాలకు ఆర్థికసాయం**

చిగురుమామిడి: మండలంలోని చిన్నముల్కనూర్ దళిత కుటుంబానికి చెందిన కన్నం వజ్రవ్వ (65) అనారోగ్యంతో మృతిచెందగా దహన సంస్కారాలకు బీఆర్ఎస్ నాయకులు ఆర్థికసాయం అందించారు. మృతురాలు పేద కుంటుంబానికి చెందినది, భర్త పదేళ్ల క్రితమే మృతిచెందగా వజ్రవ్వకు ఇద్దరు కొడుకులు. ఆర్థిక సాయం అందించిన వారిలో రైతుబంధు జిల్లా కమిటీ సభ్యుడు సాంబారి కొమురయ్య, ఎస్సీ సెల్ నాయకులు మారెల్ల కొంరయ్య, పందిపెల్లి రాజు, వార్డు సభ్యుడు పందిపెల్లి బాబు, సాంబారి రమేశ్, దొబ్బల ముత్తయ్య, నాగయ్య, పందిపెల్లి వెంకటయ్య, రాములు, బావండ్ల కొంరయ్య, పలువురు ఉన్నారు.


ఇల్లందకుంటలో...

## చిత్ర కథ




### క్రీడాప్రాంగణం.. కొనుగోలు కేంద్రం

ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన స్థలాలు గ్రామాల్లో అందుబాటులో లేకపోవడంతో అధికారులు పలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కరీంనగర్ మండలం జూబ్లీనగర్‌లోని తెలంగాణ క్రీడా ప్రాంగణంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. అయితే గత కొన్నేళ్ల నుంచి ఇదే స్థలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతీ సీజన్‌లో దాదాపు నెలరోజుల పాటు ధాన్యం కొనుగోళ్లు జరుగుతుండటంతో విద్యార్థులతోపాటు యువకులకు ఆటలాడే అవకాశం లేకుండా పోతుంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వచ్చే యాసంగి సీజన్‌లో కొనుగోలు కేంద్రాన్ని మరో చోట ఏర్పాటు చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని విద్యార్థులు, యువకులు కోరుతున్నారు. - కరీంనగర్‌రూరల్

## భక్తి శ్రద్ధలతో ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న భక్తులు

హుజూరాబాద్: నియోజకవర్గ వ్యాప్తంగా ప్రజలు దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. పండుగ సందర్భంగా ఉదయం ప్రజలు దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం వేళ చిన్నా,పెద్దా తేడా లేకుండా అందరూ టపాసులు కాల్చారు.

జమ్మికుంట: పట్టణం, మండలంలోని గ్రామాల్లో ప్రజలు దీపావళిని ఘనంగా జరుపుకున్నారు. భక్తి శ్రద్ధలతో కేదారీశ్వరస్వామి నోములు, మొక్కులు చెల్లించుకున్నారు. చిన్నా,పెద్దా టపాసులు కాల్చి సంబరాలు చేసుకున్నారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కరీంనగర్ జిల్లా :
9951602933, 9951602958, 9951602824
Office mail : knrjagati@gmail.com

సాక్షి పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
రమేష్, ACO - 7997958214
కరీంనగర్ : రాజశేఖర్ - 9618304759
చొప్పదండి : ముండయ్య - 7997958217
మానకొండూర్ : మహేశ్ - 9573106760
హుజూరాబాద్ : ప్రశాంత్ - 7331119941
టోల్ ఫ్రీ నెం.: 1800 425 9899